క్లుప్తంగా

శిల్పారామంలో వన భోజనం


ఆటల పోటీల్లో శిల్పారామ సిబ్బంది

పులివెందుల టౌన్ : కార్తీక మాసం సందర్భంగా శిల్పారామంలో శిల్పారామం సిబ్బంది, ఉలిమెల్ల లేక్ సిబ్బంది కలిసి గురువారం ఉసిరి చెట్లు కింద వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మ్యూజికల్ చైర్, స్పూన్‌తో లెమన్, తాడు లాగుట పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలిచిన విజేతలకు ఏఓ సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఈ వెంకట సుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం శివాలపల్లి గ్రామంలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవస్థాన శాశ్వత హుండీలను బుధవారం లెక్కించారు. దేవదాయశాఖ కడప డివిజన్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, గ్రామ పెద్దలు, చెన్నూరు గోవిందా సేవాసమితి, అర్చకుల సమక్షంలో స్వామివారి హుండీ కానుకలను లెక్కించగా రూ. 99,870 ఆదాయం చేకూరింది. ఈ మొత్తాన్ని దేవస్థానానికి చెందిన ఇండియన్ బ్యాంకు సేవింగ్ అకౌంట్‌లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలపల్లె సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఐ.శివారెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పీడీ, ప్రిన్సిపాల్ తదితరులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేవారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శనగల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన తిథి భోజనాన్ని, పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జిలు కలిసి విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తిథి భోజనం కింద పాయసం, ఫ్రైడ్ రైస్, పండ్లను అందించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, పాఠశాల చైర్మన్ బుజ్జి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమేశ్వరరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, వాణి, ధర్మారెడ్డి, బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు రామగంగిరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకుడు రామగంగిరెడ్డి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధీర, పీఆర్‌ఓ బాలనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం

ముద్దనూరు: మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్త మారుతి శివకు ఆ పార్టీ నాయకుడు మధుసూధన్‌రెడ్డి బుధవారం లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. గత కొంత కాలంగా శివ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించి నగదు అందజేశారు.

కడప ఉక్కు పరిశ్రమపై చర్చ జరగాలి

జమ్మలమడుగు: పార్లమెంట్ సమావేశంలో కడప ఉక్కు పరిశ్రమ గురించి ఎంపీలు చర్చించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కుపై నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం 2007 నుంచి శంకుస్థాపనలే తప్ప ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం లేదని తెలిపారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ఎంపీలు పార్లమెంట్ సమావేశాలలో స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రశాంత్, నరేంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు భిక్ష.. అన్నదాతలకు రక్ష

- ఊరూరా స్వాములకు ఉచిత అన్న ప్రసాదం
- దాతల సహకారంతో ఆలయాల్లో ఏర్పాట్లు


పడి పూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఎర్రగుంట్ల: అన్నదాన ప్రభువుగా భక్తులు అయ్యప్పను కొలుస్తారు. అందుకే మాలధారులకు భిక్ష ఏర్పాటుచేయడం భక్తజనం మహాభాగ్యంగా భావిస్తారు. ప్రస్తుతం మండల దీక్షల నేపథ్యంలో ఊరూరా అయ్యప్ప మాల ధరించిన భక్తులకు ఉచిత అన్నప్రసాదం ఏర్పాటుచేస్తూ శబరీశుడి సేవలో తరిస్తున్నారు.

నిత్యాన్నదానం

ఎర్రగుంట్ల పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక మాసం ఆరంభం నుంచి నిత్యాన్నదానం కొనసాగుతోంది. రోజూ మధ్యాహ్నం, రాత్రి సుమారు 350 మందికి పైగా భిక్ష ఏర్పాటుచేస్తున్నారు. దీక్షా సమయంలో ఏక భుక్తం (ఒక్కపూటే భోజనం) చేయాలి. భక్తులు బయట దుకాణాలు, హోటళ్లలో లభించే ఆహార పదార్థాన్ని ముట్టరు. కొందరి ఇళ్ల వద్ద రోజూ ఉదయం సాయంత్రం స్నానం ఆచరించి వంట చేసే వీలుండదు. ఈ నేపథ్యంలో మాల ధారులు బృందాలుగా ఏర్పడి ఒకచోట పీఠం ఏర్పాటు చేసుకుని అక్కడే వంట చేసుకుంటారు. ఈ ఏర్పాటు లేని భక్తులకు దాతలు ఉచిత అన్న ప్రసాదం అందిస్తున్నారు. భిక్షకు ఇబ్బంది లేకపోవడంతో అయ్యప్ప మాల ధరించే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.

అన్న ప్రసాదం ఓ పుణ్యం



యర్రగుంట్ల పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేస్తూ వస్తున్నా. అన్న ప్రసాదం ఓ పుణ్య కార్యం. నేను 17 సార్లు అయ్యప్ప మాలధారణ ధరించాను. నా వంతుగా సేవలందిస్తున్నా.

– మోహన్‌రెడ్డి, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యుడు, యర్రగుంట్ల

దాతలు సాయంతో నిరంతరాయ భిక్ష



కార్తీక మాసం ప్రారంభం నుంచి నిరంతరాయంగా ఆలయంలో మధ్యాహ్నం, రాత్రి పూజ అనంతరం భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు భిక్ష ఏర్పాటు చేసేందుకు దాతలు పోటీ పడుతున్నారు.

–నాగిరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, యర్రగుంట్ల

ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోండి


కమలాపురం: ఈ-క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి


వీరపునాయునిపల్లె: ఈ పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్యామ్‌బాబు

కమలాపురం: కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీఎన్ పల్లె, ఎర్రగుంట్ల మండలాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో రబీలో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. దీనిని పరిశీలించిన ఏడీఏ మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్ ప్రారంభమైందని, డివిజన్ పరిధిలో పంటలు సాగు చేసిన రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను కలిసి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. అలాగే ఈ కేవైసీ కూడా చేసుకోవాలన్నారు. ఇవి చేయడం వలన రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధరలకు పంటలు అమ్ముకునే వెసులు బాటు ఉంటుందని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైతులందరూ ఈ విషయాన్ని గమనించి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ దస్తగిరి, వీపీఏ మమత, రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె: రబీ 2024లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో చేపడుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందికి ఈ పంట నమోదు చేసేందుకు అప్లికేషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. నమోదులో ఎటువంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కమలాపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు అబిగ్రీన్ టెక్నాలజీ, యంగ్ ఇండియా, డిక్సన్ టెక్నాలజీస్ తదితర సంస్థలు రానున్నాయని ఆయన తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అందులో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాంబ శివుడు 99664 52542, సౌజన్య 89198 60680 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఘనంగా లక్షార్చన

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణం పరిధిలోని కడప రోడ్డు వెలసిన శ్రీ హరిహరపుత్ర శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి లక్షార్చాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీ అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన భక్తులు పూజ ఏర్పాట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ అయ్యప్ప స్వామికి వివిధ రకాల అభిషేకాలు పూజలు నిర్వహించారు. తర్వాత అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు లక్షార్చన పూజలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ


అన్నదానం చేస్తున్న పవన్ భార్గవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కడప అక్కాయపల్లెకు చెందిన వడ్డెమాని పవన్ భార్గవ్ రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు వి.లక్ష్మీదేవి, రామలింగారెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులు చింతకొమ్మదిన్నెలోని గంగమ్మ తోపులోని ఆంజనేయస్వామి ఆలయం, వేంపల్లె రాజీవ్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమం, కడప అజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమం, ఇందిరా నగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమాల్లో అనాథ వృద్ధులకు వస్త్రదానంతో పాటు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు రాజరాజేశ్వరి, వెంకట సుబ్బారెడ్డి, అరుణ కుమారి, రాఘవేంద్రరెడ్డి, వెంకట మోహిష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

పెద్దముడియం: రాజోలు ముంపు రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాల దాసు డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాజోలి ముంపు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పెద్దముడియం తహసీల్దార్ బాల నరసింహులుకు రాజోలి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏసుదాసు, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణ వేదికపై మంగళ సూత్రాలను చూపిస్తున్న పురోహితులు

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కార్తీక మాసంను పురస్కరించుకొని బుధవారం ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ ఘట్టాలు తిలకించి తరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

మండల పరిధిలోని పెద్దచెప్పలిలో శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం అనంతరం సాయంత్రం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామంలో వైభవంగా ఊరేగించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పెద్దచెప్పలిలోని అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలకు ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన స్వామివారికి పూజలు చేశారు.

రామాలయ ప్రారంభోత్సవానికి వైఎస్ జగన్‌కు ఆహ్వానం


మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన తాతిరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా కోదండరామస్వామి ఆలయాన్ని ఎండో నిధులతో నిర్మించారు. డిసెంబర్ 25వ తేదీన ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తాతిరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు విజయవాడకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కోదండ రామస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికేశవరెడ్డి, వెలిదండ్ల మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పులివెందుల టౌన్ : యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు 'కిశోరి వికాసం' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంత కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాస కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగరిగుట్ట, భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల బాలికలలో వచ్చే మార్పులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్యంపై దృష్టి సారించి జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ మానేసి, ఇంట్లో తయారు చేసే పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, నేత్ర సేకరణ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం


అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వేంపల్లె : స్వామియే శరణం అయ్యప్ప అంటూ వేంపల్లి పట్టణం అంతా అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగింది. పట్టణ పురవీధుల గుండా బుధవారం అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో అయ్యప్ప గురుస్వాములు రామమునిరెడ్డి, రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల పూజ అయ్యప్ప భక్తులు, ప్రజలను ఆకట్టుకున్నాయి. 18 మెట్లను అరటి దుబ్బలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా గురు స్వాములు మాట్లాడుతూ మండల పూజ చాలా శక్తివంతమైన పూజ అని, ఇది పూర్తి భక్తితో, అంకితభావంతో చేస్తే అన్ని కోరికలు నెరవేరుతాయన్నారు. అనంతరం మండల పూజ విశిష్టతను తెలియజేశారు. ఊరేగింపులో అయ్యప్ప భక్తులు వివిధ వేషాధారణలతో అందరిని అలరించారు. ఈ సందర్భంగా మీగడ. రామ ముని రెడ్డి, విజయమ్మ దంపతులు అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు నాగార్జున, యూత్ కొండయ్య, రవి, వెంకటసుబ్బయ్యలతోపాటు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన కల్పించాలి


పంటల బీమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

వేముల : రబీలో సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకునే రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలుపేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ చల్లా గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేసిందని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడిందని విమర్శించారు. ప్రభుత్వం పాత పంటల బీమానే అమలు చేస్తుండటంతో రైతులు మీసేవ కేంద్రాలకు వెళ్లి సాగులో ఉన్న పంటలకు ఇన్సూరెన్స్ చేసుకుంటారని, అయితే ఈ పంట నమోదు చేసుకున్న పంటలకు మాత్రమే ఇన్సూరెన్స్ చేసుకునే విధంగా రైతులకు వివరించాలని సూచించారు. మండలానికి మంజూరైన జిల్లా పరిషత్ నిధులతో నిర్దేశించిన పనులను త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడల నిర్మాణాలు చేపట్టి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ రెడ్డికి సూచించారు. మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే పంటల బీమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ ఇందిరా రాణి, ఏఓ చెన్నారెడ్డి, హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమేష్‌రెడ్డి, పశువైద్యాధికారి శశికళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, పీఆర్ ఏఈ అబ్దుల్లా, మండల ఉపాధ్యక్షురాలు లీలావతి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కో.ఆప్షన్ సభ్యులు మండి మా పీరా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి (దినేష్ మెడికల్ సెంటర్)కి శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధులు, సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు సమస్యలతో పాటు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, మాటలు రానివారికి వైద్య నిపుణులు చికిత్స చేస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు మింగినా చికిత్స ద్వారా బయటకు తీస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

70 ఏళ్లు నిండిన వారికి ఉచిత హెల్త్ కార్డు

తొండూరు : ప్రధాన మంత్రి జన ఆరోగ్య రక్షణ పథకం కింద ఉచితంగా రూ.5 లక్షల హెల్త్ కార్డు పొందవచ్చునని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. బుధవారం మండలంలోని ఇనగలూరు గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో పీఎంజేఏవై పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా మాట్లాడుతూ ఇప్పుడు 70ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికి ఈ పథకానికి అర్హులన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా సెకండరీ, టెర్షియరీ ఆరోగ్య సదుపాయాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నిర్దేశిత జాబితాలోని ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య. ఏఎన్‌ఎం గౌరి, ఆశా వర్కర్లు రమాదేవి, వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

'అన్నా క్యాంటీన్‌లో నాసిరకం భోజనం'

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు అన్నా క్యాంటీన్‌లు పేద ప్రజలకు భోజనం ప్రారంభించింది, అయితే అక్షయపాత్ర యాజమాన్యం నాసిరకం భోజనం పెడుతున్నారని వ్యవసాయ కార్మిక సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ ఆరోపించారు. బుధవారం యర్రగుంట్ల పట్టణంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యర్రగుంట్ల పట్టణంలో అన్నా క్యాంటీన్‌లోని భోజనం పరిశీలించామన్నారు. అక్షయ పాత్ర యజమాన్యం నాసిరకం భోజనం సరఫరా చేస్తుందన్నారు. మున్సిపల్ అధికారులు అక్షయ పాత్ర కాంట్రాక్ట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రారంభం రోజు కాంట్రాక్టర్లు నాణ్యతతో కూడిన భోజనం పెట్టారని, తర్వాత అన్నా క్యాంటీన్‌లో నాసిరకం భోజనం కూరలు పెడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పులివెందుల రూరల్ : విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణవేణి తెలిపారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు సమగ్ర పోషక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివితేనే పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారన్నారు. అనంతరం మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రదీప్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎరిస్ కంపెనీ సీఎండీ రాహుల్, రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ఎర్రగుంట్ల : జువారి సిమెంట్ ఫ్యాక్టరీ గనులలో బ్లాస్టింగ్ చేసేటప్పుడు కార్మికులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెన్స్ సేఫ్టీ పెద్దిరెడ్డి రఘుపతి సూచించారు. బుధవారం జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో మైనింగ్ కార్మికులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గనులలో మందుగుండు ఉపగించేటప్పుడు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ మెన్స్ సేఫ్టీ కేపీ నాయుడు, ప్లాంట్ హెడ్ జీజీకె మూర్తి, అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యర్రగుంట్ల ఎంపీడీఓ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం ఆధార్ క్యాంప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ ఆధార్ క్యాంప్‌లలో ఆధార్ కార్డులోని పేరు తప్పులను, చిరునామా మార్పులు, ఆధార్ అప్‌డేట్‌లను సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : సస్యరక్షణ చర్యలు చేపడితే కంది పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం ఫసల్ బీమా యోజన కింద 8 రకాల పంటలకు బీమా చేసుకోవచ్చునని తెలిపారు. రైతులు సీఎస్‌సీ లోనూ, సచివాలయంలోని డిజిటల్ అసిసెంట్లు, ప్యాక్స్, పోస్టాఫీసుల ద్వారా భూమి కౌలు కార్డు పంట, పంట వేసిన ధ్రువ పత్రం, బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలను సమర్పించి ఆన్‌లైన్ ద్వారా డిసెంబర్ 15వ తేదీలోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. అనంతరం ఆమె కంది పంటను పరిశీలించి కందిలో ఆశించిన రసం పీల్చే పురుగు గుర్తించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి ఎం హరిత, రైతులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో పంటల బీమా

కమలాపురం: 2024-25 రబీ నుంచి రైతులు తాము సాగు చేసిన పంటలకు స్వచ్ఛందంగా పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దచెప్పలి, దేవరాజుపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా పంటలకు దిగుబడి నష్టం జరిగినపుడు రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి పంటల భీమా దోహదపడుతుందని, ప్రతి రైతు పంటల భీమా నమోదు చేసుకోవాలని ఆమె అన్నారు. అనంతరం మినుము, వేరుశనగ పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆరోగ్యవంతమైన పంటల సాగుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. ఘన జీవామృతం తయారీని రైతులకు డెమో ద్వారా చూపించారు. వీఏఏ మంజుల, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వల్లూరు: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము పంటలో పురుగు ఉధృతి ఉక్కువగా ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను పురుగు నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సాయి జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో బుదవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన మినుము, బుడ్డ శనగ, కంది పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పంటను ఆశించిన పురుగుల నివారణకు బారాజైడ్ మందును లీటరు నీటికి 2.5 ఎమ్ ఎల్ చొప్పున మరియు 13-0-45 లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దొరబాబు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా ఆర్‌ఏడబ్ల్యూఈపీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.